# ఆగామి వసంతం

- స్వామి

నా మేనమామ కూతురు నాకంటే వయసులో రెండేళ్లు పెద్దది. పేరు పార్వతి.

పార్వతీ, నేనూ చిన్నప్పుడు ఆడుకున్నాం. టవల్ బొడ్లో దోపి పైటలా కప్పుకుని ఒక మహా ఇల్లాలుగా మారిపోయేది ఆ చిన్న పార్వతి! చిన్న



చిన్న బుడిగీలలో అన్నమూ, కూరలూ వండేది. నేను నా ఉత్తుత్త కారులోంచి ఆఫీసరులా కిందికి దిగేవాడిని. మన్నులోకి నీళ్లు పోసి కలికిన ఆ పదార్థాలన్నీ తింటున్నట్లు నటిస్తూ నా భర్త



హోదాను వెలగబెట్టేవాడిని.

ఇప్పుడు నేను ఆఫీసరూ కాదు, ఆమె చిన్నప్పటి వంటలక్కా కాదు. పైగా, ఆమె ఎమ్మెస్సీ బి.ఇడి. చేసి ఒక హైస్కూల్‌లో సైన్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉంది. నేను మాత్రం చదువు సరిగా అంటక, చదివిన ఆ కొంచెం చదువుకూ ఉద్యోగం రాక బతకలేని బక్కరైతుగా మిగిలిపోయాను చివరికి.

'ఇది వయసులో రెండేళ్లు పెద్దదైపోయింది కానీ, లేకపోతే నా కొడుక్కు చేసుకునేదాన్ని కదా!' అని తన మేనకోడల్ని చూసి ముచ్చటపడుతూండేది మా అమ్మ.

తన రెండు జడలూ ఎగరేసుకుంటూ, పార్వతి ఒక కుందేలు పిల్లలా దూకుతూ వచ్చేది మా ఇంట్లోకి. ఆమె చేతుల్లోని ప్రోగ్రెస్.రిపోర్టు చూడగానే రైలు పట్టాలమీద తల పెట్టినట్లుగా నా గుండె ధాం ధాం అని కొట్టుకునేది. వెంటనే పార్వతికి వచ్చిన మార్కులతో నా మార్కుల్ని పోల్చి చూసి, "వీడు ఉత్త తుమ్మమొద్దు!" అని తిట్టేవాడు మా తండ్రి. పార్వతి' మాత్రం తన మేనత్త ఒడిలో కూర్చుని ఆమె పొగడ్తలు వింటూ ఉత్సాహంగా కాళ్లాడిస్తూ చూసేది నా వైపు.

నాకూ, పార్వతికీ వయసులో తేడా రెండేళ్లే అయినప్పటికీ, హఠాత్తుగా ఒకరోజు ఆ తేడా పన్రెండేళ్లకి పెరిగిపోయింది. ఆమె పుష్పవతి అయిందని పట్టు చీర కట్టి సింగారించి కూర్చోబెట్టిన రోజది! ఎవరో ఒక దేవతకు నైవేద్యం పెట్టినట్లు ఆమె ఎదురుగా ఒక్కొక్క పళ్లెంలోనూ వివిధ రకాల స్వీట్లూ, పండ్లూ! ముత్తైదువులు నవ్వుతున్నారు. గుసగుసలాడుతున్నారు. పాటలు పాడుతున్నారు. వారి మధ్య తన కేదో కొత్త గుర్తింపు వచ్చినట్లు ఆ పెద్ద కుర్చీలో సిగ్గు పడుతూ కూర్చుంది పార్వతి. విద్యుద్దీపం వెలుతురు కింద కొత్తగా మెరిసిపోతోంది.

నా జారిపోయే నిక్కర్‌ని మొలతాడు కిందికి తోసుకుంటూ - 'ఈమె నాతో ఆడుకున్న పార్వతేనా' అని బిత్తరపోయి చూస్తున్నాను. ఆమె చప్పున ఒక అపరచిత వ్యక్తిలా మారిపోయినట్లూ, నా నుంచి చాలా దూరం జరిగిపోయినట్లూ అనిపించి నా గుండెను ఏదో చిత్రమైన బాధ తొలిచివేసింది.

మగ పిల్లలకు పురుషత్వాన్ని గుర్తుచేయడంలో కంటే, ఆడపిల్లలకు స్త్రీత్వపు వికాసాన్ని గుర్తు చేయడంలోనే సృష్టి మరింత స్పష్టతా, వేగమూ కనబరుస్తుం దనుకుంటాను.

వయసు పెరిగేకొద్దీ ఒక మగపిల్లవాడుగా నేను ఊళ్లో తిరిగే ప్రదేశాలు ఎక్కువ అయినాయి. పార్వతి పరిధి మాత్రం మరింత మరింత కుంచించుకుపోయి, ఇల్లూ, స్కూలూ - ఒకటి రెండు స్నేహితురాళ్ల ఇళ్లకు పరిమితమైపోయింది. ఫలానా టైమ్‌లోగా ఇల్లు చేరుకోవాలనీ, ఫలానా దూరానికి మించి వెళ్లకూడదనీ రుద్దబడిన సమయ, ప్రాదేశిక ఆంక్షలు ఆమె సామాజిక విస్తృతిని ఖండించడం వల్లనే కాబోలు - ఆమె మరింతగా తనలోకే ముడుచుకుపోతూ పొద్దు గడవడానికి క్లాసు పుస్తకాలనే ఎక్కువగా ఆశ్రయించసాగింది. 'మగపిల్లలు ఎక్కువగా తిరుగుతారు కాబట్టి చదవరు. ఆడపిల్లలు ఇంటిపట్టున ఉంటారు కాబట్టి బాగా చదువుతారు' అని తీర్మానం చేసేవాడు మా తండ్రి.

పార్వతి టెన్త్ పాసు కాగానే ఒక పెళ్లి సంబంధం వచ్చింది. వాళ్లు కట్నం అడగలేదు. మా బ్రాహ్మణుల్లో అటువంటి సంబంధం తారసపడటం అబ్బురమే! కట్నం ఇచ్చే స్తోమత లేని మా మామయ్య పార్వతిని ఆ ఇంటి కివ్వాలని చాలా ఆశ పడినాడు. 'ఈ సంబంధం చేసుకుంటే సుఖపడతావు' అని నచ్చచెప్పబోయే తన తండ్రితో - "నే నిప్పుడే పెళ్లి చేసుకోను. ఇంటర్ చేరతాను. డిగ్రీ కూడా చదువుతాను" అని పట్టుబట్టి విజయం సాధించింది పార్వతి.

పార్వతి పెళ్లి చేసుకోనంటే నా కెందుకు సంతోషం కలగాలో అప్పుడు నేను ప్రశ్నించుకోలేదు గానీ; ఎవడో వచ్చి నా చిన్ననాటి స్నేహితురాలిని గద్దలా తన్నుకుపోయే పరిస్థితి తప్పింది కదా అన్న ఆలోచనే అప్పటి నా మీద బాగా పనిచేసి ఉంటుంది.

ఆమె పెద్దమనిషి అయినాక నన్ను మరీ చిన్నపిల్లవాడి మాదిరి చూడటం ప్రారంభించింది. ఇంటర్ చేరగానే తను మరీ పెద్దదైపోయినట్లు నా చదువు గురించి ఆరాలు తీసి కేకలు వేయడం కూడా మొదలుపెట్టింది. అందుకు తగినట్లుగానే అప్పటికి ఆమెకన్నా చాలా పొట్టిగా ఉండేవాడిని. నేను అతికష్టమ్మీద టెన్త్ పాసై ఇంటర్‌లో చేరిన ఉత్సాహంతో పాంటులోకి మారిపోయి కనిపిస్తే - "ఒరే రాజూ! నువ్వూ పెద్దవాడివైపోయా వన్నమాట!" అని పగలబడి నవ్వింది. ఆమె నవ్వితే నవ్వినది గానీ, నే నెందుకు చచ్చేంతగా సిగ్గుపడాల్సి వచ్చిందో ఇప్పటికీ నాకు అర్థం కాదు. ఇంటర్ నుంచి డిగ్రీలోకి ప్రవేశించడంతో లంగా, పైటల్లోంచి చీరలోకి మారిం దామె. ఆమె నన్ను చూసి, నవ్వినట్లుగానే నేను కూడా - "ఓ పార్వతీ! నీవూ పెద్దదానివైపోతున్నా వన్నమాట!" అని అనడానికీ, నవ్వడానికీ సాహసించలేకపోయినాను. పైగా ఆమెను చూసి చూపులు మరల్చుకునే ప్రయత్నంలో సిగ్గుపడటం మళ్లీ నావంతే అయింది.

పార్వతి చాలా దగ్గరగా మెలగాల్సిన సందర్భం ఎదురైనప్పుడు, ఆమె మామూలుగానే ఉండేది కానీ, నేను మాత్రం ఆమె రొమ్ములు నా చేతికి తగలకుండా ప్రత్యేకంగా జాగ్రత్తపడవలసి వచ్చేది. పురుషుని ఛాతీకి లేని అదనపు పొంగుల్ని స్త్రీ కలిగి ఉండటం వల్ల బాల్యంలో రాసుకుంటూ పూసుకుంటూ తిరిగినట్లు పెరిగి పెద్దయినాక కూడా అదే విధంగా మెలగడానికి వీలు కాదేమో!

తల్లి దగ్గరా, ఈడొచ్చిన చెల్లెళ్ల దగ్గరా కూడా స్త్రీ శరీర నిర్మాణం కల్పించే అవస్థను మగవాడు తప్పించుకోలేడు. అటువంటప్పుడు మోడరన్ సొసైటీ యువతీ యువకులు అంటుమొక్కల్లా అతుక్కుపోయి తిరుగుతూ, మాది ఉత్త స్నేహ సంబంధం మాత్రమే అంటే ఆ మాట నా కెంతో ఆశ్చర్యంగా ఉంటుంది.

పార్వతి అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి - "ఒరే రాజూ! నా ఫ్రెండ్ ఇంటికి పోతున్నాను, అంతవరకూ తోడు రావా!" అని అడిగేది. నేను ఆమె బాడీ గార్డుగా మారాల్సిన అవకాశం రావడం వల్ల నా జాతి పక్షులు స్త్రీ ఎత్తుపల్లాల్ని ఏ విధంగా చూపులతో గుచ్చి గుచ్చి చూస్తాయో బాగా

అనుభవంలోకి వచ్చింది. మగవాడు స్త్రీని ఆ విధంగా చూడటం సహజమో, లేక తనకు గర్భం వచ్చే ప్రమాదం లేని నిర్భయత్వంలోంచి పుట్టుకొచ్చిన విశృంఖల కామభావపు బరితెగించినతనమో నాకు తెలియదు కానీ, పార్వతిని అట్లాంటి కాముక దృష్టితో చూసేవాళ్ల మీద నాకు కోపం పొంగుకొచ్చేది. తమ వెకిలి చూపులతో పార్వతిని న్యూనత పరుస్తున్నారు అన్న కారణంతోపాటు 'ఆమె బాడీగార్డయిన్న నా మగదక్షతనే సవాల్ చేస్తారా?' అన్న అహం కూడా మిళితమై ఉండేది ఆ కోపంలో.

ఒకరోజు - "మీకేం రా మగరాయుళ్లు! ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లొచ్చు. మాకు ఆ అదృష్టం లేదు కదా!" అంది. ఆమె చూడాలనుకున్న ఒక పాత తెలుగు పిక్చర్‌కు అదే ఆఖరి రోజు. ఆ సినిమాను అప్పటికే ఆమె ఫ్రెండ్సు చూసేసినారు.

"నేను పిల్చుకుపోతానులే!" అన్నాను.

"ఔనా? అయితే సరే!" అంటూ బయలుదేరడానికి సిద్ధపడింది.

"ఏం? ఆ సినిమా చూడకుంటే ఛస్తావా? నిన్ను కాలేజీకి పంపడమే ఎక్కువ. మళ్లీ సినిమాలకు కూడానా?" అని సాధించటం మొదలుపెట్టింది మా అత్త.

"రాజు వెంట వస్తున్నాడు కదా!" అంది - నేను ఒక్కదాన్నే పోవడంలేదు కదా అన్నట్లు.

"వాడింకా చిన్న పిల్లోడే అనుకుంటున్నావా?" అంటూ అరిచింది.

"ఈడొచ్చిన పిల్లాణ్ని వెంటేసుకుని టింగురంగా అని మ్యాట్నీకి పోవడానికి సిగ్గు లేదా నీకు?" అని కేకలు వేసింది. నావైపు కూడా ఒకసారి కొరకొరా చూసి లోపలికి వెళ్లిపోయింది.

మా అత్త మాటలకు నేను దిమ్మరపోయి నిలబడిపోయాను. అయితే నేను కూడా అనుమానింపదగిన పురుషుల కోవలోకే వస్తానన్నమాట! నా బుర్ర మొద్దుబారినట్లు అనిపించింది. క్షణంపాటు నేనూ, పార్వతి శూన్యంగా ముఖాలు చూసుకున్నాం. సిగ్గుతో, అవమానంతో పార్వతి ముఖం ఎర్రగా కందిపోయంది. నేను మెల్లగా లేచి బయటకు వచ్చేసినాను.

స్త్రీ, పురుషుల మధ్య 'అది' తప్ప ఇంకేమీ లేదన్నట్లుగా మాట్లాడిన మా అత్త మాటలు గుర్తుకొచ్చినప్పుడల్లా నాకు కంపరం కలుగుతూండేది. కానీ, ఆడా-మగాల మధ్య గల వయసు తేడాలూ, స్నేహపు సెంటిమెంట్లూ - అన్నీ ఒకానొక అనుకూల క్షణంలో దుస్తుల్లా జారిపోయి, ఆ నిష్కల్మష సంబంధాలు చివరకు గోడచాటు వ్యవహారాలుగా పరిణమించిన ఎన్నెన్నో సంఘటనలు వినీ, చూసీ, జీవితంలోని నిష్ఠురసత్యం అనుభవంలోకి వచ్చిన తరువాత ఇప్పుడాలోచిస్తే అనిపిస్తుంది - 'పాపం! మా అత్త తప్పు ఏం ఉందీ? లోకానుభవంతో ఆలోచించి జాగ్రత్త పడింది. అంతే!' అని.

నీతికీ, ధర్మానికీ, ప్రేమకీ, అమాయకత్వానికీ రుజువుగా నిలబడే యువతీ యువకుల స్నేహ సంబంధాలు కూడా సమాజంలో లేకపోలేదు. కానీ ఒక ఆడపిల్ల తల్లిగా ఏ పుట్టలో ఏ పాముందో అని అనుమానించడం నేర్చుకున్న మా అత్తలాంటి వాళ్లకు - నాకూ, పార్వతీకి మధ్య ఉన్న స్నేహ సంబంధంపై విశ్వాసం కలిగే అవకాశమే లేదు.

మా అత్త నన్ను ఒక పిల్లవానిగా కాక, ఒక పురుషుడుగా జమకట్టి మాట్లాడిన రోజుకు పూర్వమే బిడియంగా సెలూన్‌కి వెళ్లి నా మొదటి గడ్డం తీయించుకుని ఉండటం ఇప్పటికీ నాకు గుర్తే! అప్పుడు పసితనం నా మనసుకే గాని, నా శరీరానికి కాదు.

నేను ఇంటర్‌లో రెండుసార్లు డుమ్కీ కొట్టి ఆయాసపడుతూ డిగ్రీలో చేరేటప్పటికి పార్వతి మంచి మార్కులతో డిగ్రీ పూర్తి చేసి బయటికొచ్చింది. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూడబోతే ఎమ్మెస్సీ చదువుతా నని అడిగింది.

ఆడపిల్ల బి.ఎ. చదివితే బి.ఎ., ఎం.ఎ. చదివితే ఎం.ఎ. వరుడినీ సంపాదించి పెట్టడం తండ్రులకు భారమే కదా! ఆ ఆలోచనతోనే పార్వతి ఎమ్మెస్సీ చేయడం తనకు ఇష్టం లేదన్నాడు మా మామయ్య. కానీ పార్వతి మాత్రం "ఏం? ఆడపిల్లలు ఎందుకు చదువుకోకూడదు?" అంటూ వాదించింది.

పార్వతి ఒక్కతే కూతురు కావడంతో, అదీ మంచి మార్కులతో పాసు అవుతూ వస్తూండటంతో చివరికి మా మేనమామ కూడా కాదనలేకపోయినాడు. 'అదృష్టం కొద్దీ ఏదైనా మంచి సంబంధం తగిలితే మధ్యలో చదువు మానిపించవచ్చులే!' అని కూడా ఆలోచించి ఉంటాడు.

ఎమ్మెస్సీలో చేరిన తరువాత అంతవరకూ లేని ఉత్సాహమేదో పార్వతిలో రేకులు విప్పుకోసాగింది. ప్రేమకు సంబంధించిన నవలలు చదువుతూ, హృదయం ఆర్ద్రమై కళ్లల్లో తడి పొంగుకొస్తే, ఆ కన్నీళ్ల మీదుగానే సిగ్గుపడుతూ నవ్వి మా మధ్యనుంచి లేచి వెళ్లిపోయేది. తలంటుకున్న కురుల్ని భుజం మీద ఆరబోసుకుని చిక్కు తీసుకుంటూ కూని రాగాలు తీసేది. తలలో ముడుచుకోవడానికి పువ్వుల్ని ఎంతో శ్రద్ధగా సంపాదించుకునేది. పెళ్లి ప్రస్తావన వస్తే గూఢమైన చిలిపితన మేదో ఆమె నవ్వు కళ్లల్లో తొంగి చూసేది.

ఎమ్మెస్సీ పరీక్షలు అయిపోయిన తరువాత, తన క్లాసుమేటు అబ్బాయి ఒక అతను తనను పెళ్లి చేసుకుంటానని అడిగినట్లు మా అత్తయ్య చెవిలో ఊదింది. ఆ అబ్బాయి కులమూ, గోత్రమూ అన్నీ విచారించేసి - "వాళ్లు స్మార్తులు. మనం శ్రీవైష్ణవులం. వాళ్లకు అభ్యంతరం లేకపోయినా మనకు అభ్యంతరం ఉంది. మన కా సంబంధం సరిపోదు" అని తేల్చేసినాడు మా మేనమామ.

పార్వతి అలగలేదు. అన్నం మానెయ్యలేదు. ఒక నిట్టూర్పు మాత్రం విడిచి ఉంటుంది. శాఖాంతరం అనేది ఒక దాటకూడని హద్దు అని ఆమె మనసు కూడా అంగీకరించివేసింది. ఆడపిల్లలు చదువుకుంటే తప్పా? అని ఎదురు తిరిగిన ఆమె ఆధునిక మనస్తత్వం - పెళ్లి వరకూ వచ్చేటప్పటికి సంప్రదాయం నుండీ ఒక అడుగు దూరం కావడానికి కూడా సిద్ధపడలేకపోయింది. తను చేసుకోబోయే వరుడు 'మస్ట్ అండ్ షుడ్'గా పోస్ట్ గ్రాడ్యుయేట్' అయి ఉండాలని మాత్రం షరతు పెట్టింది. జానపద గాథల్లోని రాజకుమార్తెలు ఏ తోటమాలినో, ఏ మామూలు రైతు బిడ్డనో పెళ్లి చేసుకుని ఉండవచ్చుగాని, ఈ కాలంలో తనకంటే తక్కువ చదివిన కుర్రవాణ్ని పెళ్లి చేసుకోవడానికి ఏ ఆడపిల్ల ఇష్టపడుతుంది? అంగీకరించవచ్చు. అంతే!

మూడు నెలల్లోపలే పార్వతికి ఒక పెళ్లి సంబంధం వచ్చింది. వరుడు ఎమ్.ఎ., తాలూకా ఆఫీసులో గుమస్తా. పై ఆదాయం బాగానే ఉంటుందని పార్వతి తండ్రి పొంగిపోయి చెప్తుంటే నాకు కంపరం కలిగింది. అప్పటికే నేను డిగ్రీ గట్టెక్కలేక వ్యవసాయ వృత్తిని ఆశ్రయించి, బోర్‌వెల్లూ, ఎరువులూ, లోన్ల కోసం పరుగెత్తుతూ ఆ యా ఉద్యోగులకు లంచాలు ఇవ్వలేక బలి అయిపోతున్న వాడిని. పార్వతి ఒక లంచగొండి ప్రభుత్వోద్యోగికి సహధర్మచారిణి కావడం నా మనసు ససేమిరా ఒప్పుకోలేకపోయింది. ఇంతకన్నా పార్వతి తను ప్రేమించిన వానినే పెళ్లి చేసుకుని ఉండి ఉంటే ఎంత బాగుండేది అని అనిపించింది - అప్పుడు మాత్రం!

నా తల్లిదండ్రులూ, పార్వతి తల్లిదండ్రులూ ఆ పెళ్లిచూపులకు వచ్చిన వారి దగ్గర వెన్నెముకలేని నత్తల్లా పాకుతూ, చీమల్లా మాట్లాడుతూ, కర్ర దెబ్బలకు కాచుకునే శునకాల మాదిరి నక్కి నక్కి భయభక్తులు ప్రదర్శిస్తుంటే; ఆ వచ్చిన లంచగొండి వరుని పట్ల కనీసం నా చూపుల్లోనయినా నిరసన భావం ప్రకటించే సాహసం చెయ్యలేకపోయినాను. పైగా అతని సేవకు సిద్ధపరచబడిన బంట్రోతు మాదిరి నాకు వాకిట్లోనే తచ్చాడక తప్పింది కాదు. నా గురించి కూడా నా కంత బాధలేదు కానీ; పార్వతి కూడా ఆ మగపురుగు కోసం బుగ్గలు ఎరుపు చేసుకోవడం నాకు ఏమాత్రం గిట్టలేదు.



### మంచిపని

పాఠశాలలో ఉపాధ్యాయుడు తన పిల్లలతో ప్రతిరోజూ ప్రతి విద్యార్థీ కనీసం ఒక మంచిపనైనా చేయమని చెప్పాడు. వారం రోజుల తర్వాత విద్యార్థులను వారు చేసిన మంచి పనులను గురించి అడిగాడు.

రమేష్ : సార్! నిన్న మేం నలుగురం కలిసి ఒక మంచి పని చేశాం.

టీచర్ : ఏం చేశారు.

రమేష్ : ఒక ముసలి అవ్వను రోడ్డు దాటించాం, సార్!

టీచర్ : అదేమిటి రోడ్డు దాటించడానికి ఒక్కరు సరిపోతారు కదా!

రమేష్ : అది నిజమే, కాని ఆవిడ రోడ్డు దాటాలని అనుకోవడంలేదు మరి.

టీచరు : ఆఁ!

వల్లాల సుషమ [బలపాల]

ఈ అధునిక సమాజంలో పెళ్లి ళ్లకు సంప్రదాయం అడ్డురావచ్చుగానీ లంచగొండితనం అడ్డురాదు కదా?

జీతమూ, పై ఆదాయాలూ అన్నీ కలుపుకున్నా పొట్ట గడుస్తున్నట్టు లేదు పాపం ఆ పెళ్లికొడుక్కి? వాళ్లు డెబ్బయి వేలు కట్నం అడిగినారు. మా మేనమామ నలభై అన్నాడు. వాళ్లు అరవై అన్నారు. మా మామ నలభై అయిదు అన్నాడు. సర్కారు పాట వీగిపోయినట్లు ఆ సంబంధం పోయింది.

సంవత్సరం లోపల మరో సంబంధం వచ్చింది. వరుడు ఒక కళాశాలలో పని చేస్తున్న జూనియర్ లెక్చరరు. నలభై అయిదూ.... అంటూ పాత పాటే పాడుతూ బీద అరుపులు అరుస్తున్న మా మామతో - 'రౌండ్ ఫిగర్ అయితే నలుగురిలోనూ చెప్పుకోవడానికి మాకు గౌరవంగా ఉంటుంది' అన్నారు వాళ్లు. ఎంత కట్నం తీసుకుంటే వరునికి అంత ప్రెస్టేజి అని భావించే కుహనా విలువల సమాజంలో ఇంకా కూరుకుపోయే ఉన్నారు వాళ్లు. మా మామ ఈ కొట్టినాడు కానీ చివరి దఫా జరిగిన శిఖరాగ్ర సమావేశంలో చర్చలు విఫలమయినాయి. 'లాస్ట్ స్ట్రా ఆఫ్ ది కామెల్స్ బాక్' అన్నట్లు పెళ్లికొడుకు హీరో హోండా బండిని కూడా కోరుకున్నాడు. ఆ బండి లేకపోతే పెళ్లి అస్సలు వీలు కా దన్నాడు - పెళ్లికూతురు అనే ఆడ పదార్థంతో పాటు 'బై ప్రొడక్ట్'లా పుట్టుకొచ్చిన మరో వస్తువు ఆ హీరో హోండా బండి! పెళ్లికూతురు తన పడక మీద చేరడంతో పాటు ఆ బండి కూడా తన ఇంటి ముంగిట్లో వాలితీరాలని అతని నిశ్చితాభిప్రాయం.

ఫ్రిడ్జ్, కలర్ టి.వి. .... ఒక టేమిటి? సైన్సు కనిపెట్టిన ఖరీదు సౌకర్యాలన్నీ సాధించుకోవటానికి ఏకైక మార్గం పెళ్లి - నేటి యువతరానికి!

'బండి కొనిస్తే అది మీ అల్లునికే కదా? బండి వెనక కూర్చోబెట్టుకుని మా వాడు - సినిమాలకూ షికార్లకూ తీసుకుపోయేది మీ అమ్మాయినే కదా?' అని పెళ్లి కొడుకు తల్లిదండ్రులు ఎంత నిస్వార్థంగా మాట్లాడినప్పటికీ ఆ హీరో హోండా ఒక భూతం మాదిరి భయపెట్టక మానలేదు మామను. ఆ సంబంధమూ తప్పిపోయింది.

ఇట్లే మూడేళ్లు గడిచిపోయినాయి. సంబంధాలు వస్తున్నాయి. పోతున్నాయి. పార్వతి కూడా పెళ్లిచూపులకు యాంత్రికంగా అలవాటుపడిపోయింది. ఎంతమంది కోసమని ఆమె బుగ్గలు ఎరుపు చేసుకుంటూ కూర్చోగలదు పాపం!

కేవలం కట్నం కోసమో, జీవంలేని ఒక మోటార్ సైకిల్ కోసమో తనకు నచ్చిన ఆడపిల్లనే ఏకంగా త్యాగం చేయగలిగిన వరుల్ని చూస్తే నాక్కొంచెం ఆశ్చర్యం కూడా కలిగేది - 'డబ్బూ బంగారమూ, వాహనాల కంటే మోహపెట్టలేని వస్తువైపోయిందా ఆడది ఈ మగవాళ్లకి?' అని.

తనకు ఇరవై ఆరేళ్లు సమీపిస్తుండగా అణ్ణామలై యూనివర్సిటీ కింద బి.ఇడి., చేసి సైన్సు అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరింది పార్వతి. ఈ పని ఆమె ఎప్పుడో చేసి ఉండాల్సింది. ఎందుకంటే ఉద్యోగం చేసే అమ్మాయిలకు డిమాండు కొంచెం ఎక్కువగానే ఉంది ఈ కాలంలో. కానీ ఆ డిమాండును కూడా అడ్డుకునే శక్తి మా బ్రాహ్మణుల్లో జాతకాలకు ఉందని తెలిసొచ్చింది.

'వీళ్ల గోత్రం ఫలానా, వాళ్ల శాఖ ఫలానా'... అంటూ అనేకానేక కారణాల్తో చాలా సంబంధాలని తోసిపారేసి; మిగిలిన కొన్ని సంబంధాలనూ జాతకాల్లోంచీ ఫిల్టర్ చేయగా చివరకు ఒకటీ అరా సంబంధాలు కూడా మిగలటం లేదు.

జాతకాలు సరిపోయిన వాళ్లకు కట్నం చాల్లేదు. కట్నం సరిపోయిన వాళ్లకు జాతకాలు కుదరలేదు. అంతా నుదుటి రాత అంటారు గానీ, ఈ విచిత్రంతో పోలిస్తే పాపం బ్రహ్మరాత మాత్రం ఏపాటిది?

ఉద్యోగస్థురాలు కావడంతో పార్వతిలో ఒక విధమైన హుందాతనం కొట్టవచ్చినట్లు కనిపిస్తుండేది. కానీ ఆ గాంభీర్యం వెనక - 'తనకు పెళ్లి కాకుండానే వయసు దాటిపోతూ ఉంది కదా?' అనే వెలితి మాత్రం ఆమెను కలతపెడుతూనే ఉండేది.

నా తమ్ముళ్ల చదువులూ, చెల్లెళ్లూ, అన్నీ ఒక కొలిక్కి వచ్చేవరకూ నేను నా పెళ్లి విషయం ఆలోచించకూడదు అనుకున్నాను. బోర్లూ, బావులూ ఎండిపోయి వ్యవసాయం దెబ్బతిని ఆర్థికంగా మా కుటుంబం చితికిపోవడంతో నా తల్లిదండ్రులు కూడా నా పెళ్లి గురించి పట్టుపట్టలేకపోయినారు.

ఒక రోజు మా మేనమామతో కొంచెం పని ఉండి పోయినాను. ఆయన ఇంట్లో లేడు. 'కొంచెం సేపు కూర్చో రాజూ? పోదువుగాని' - అంది పార్వతి. నేను తోట పనుల్లో తలమునకలు అవుతూండటం వల్ల పట్టుమని పది నిముషాలు కూర్చుని పార్వతితో మాట్లాడటానికి అవకాశమే ఉండటంలేదు ఈ మధ్య.

లోపలికి పోయి ఒక గ్లాసులో పాయసం తెచ్చిచ్చింది. 'ఏమైనా విశేషమా' అని అడిగితే - 'ఈ రోజు నా పుట్టిన రోజు కదా?' అని ఒక జీవంలేని నవ్వు నవ్వింది. నిజమే? అయితే పార్వతి వయసు ముప్పైలో పడిందన్నమాట!

మునుపటిలా లేదు పార్వతి. చెంపలు పీక్కుపోయినాయి. తలలో అక్కడక్కడా వెంట్రుకలు తెల్లబడినాయి. కళ్లకు అద్దాలు వచ్చినాయి. కన్నె వయస్సు తుళ్లింతలు ఏనాడో అంతరించిపోయినాయి. ఆ స్థానంలో ఏదో ఉదాసీనత వచ్చి కూర్చుంది మనిషి మాత్రం అట్లే సన్నగా ఉంది - పెళ్లిళ్లు అయిపోయి వాకిలి పట్టకుండా లావైపోయిన తన స్నేహితురాళ్ల మాదిరి కాకుండా పెళ్లి ప్రస్తావన రాగానే సిగ్గుపడే పరిస్థితి ఆమె కిప్పుడు లేదు. పైగా తన వయసుకు తగిన సంబంధాలు ఎక్కడైనా ఉన్నాయేమో అని తన స్టాఫ్ రూమ్‌లో వాకబు చేస్తుంటుంది కూడా. ప్రస్తుతం ఆమె ఆలోచనల్లో వచ్చిన ముఖ్యమైన మార్పు ఏమిటంటే - వరుడు తనకంటే తక్కువ చదువుకున్నవాడైనా ఫరవాలేదుగానీ ఒక ఉద్యోగస్థుడై ఉంటే చాలని. ఆమెలో ఇంకా ఎంతమార్పు వచ్చిందో ఆ తరువాతగానీ తెలిసిరాలేదు నాకు.


నలభై ఏళ్లూ, నలభై అయిదేళ్లూ పైబడిన వరులు ఒకరిద్దరు తారసిల్లారు. వాళ్లు పెళ్లి పెద్దల్లా కనిపించినారేగానీ పెళ్లి కొడుకుల్లా కనిపించలేదు నా కంటికి. కారణాలు ఏవైతేనేం? చివరికి ఆ సంబంధాలూ తప్పిపోయినాయి. పెళ్లి తన జాతకంలోనే లేదేమో అన్న నిరాశ పార్వతిని మెల్లమెల్లగా ఆవరించేసుకుంది.

'పెళ్లీ, సంసారం... ఆ జంజాట మంతా ఎందుకులేరా? ఇట్లే ఉంటే హాయిగా ఉంటుంది'' అనేది అప్పుడప్పుడు. ఆ మాట చాలా దొంగమాటలా అనిపించేది నాకు. పెళ్లి మీద ఆమెకు ఎంత అపేక్ష ఉందో నాకు తెలియం దేమీ కాదు. పెళ్లి పట్ల ఆమెకు నిజంగా విముఖత్వమే ఏర్పడి ఉంటే ఇప్పటిలా నిరాశకు లోనుగాకుండా ఎంతో ఉత్సాహంగా జీవింపగలిగేది. మనుషులంతా చచ్చినట్టు పెళ్లిళ్లు చేసుకోవాలని రూలేమీ లేదు కదా?

ఆమె తన ఈడు ఆడవాళ్లతో కలవలేదు. వాళ్ళంతా పెళ్లిళ్లు చేసుకుని - తమ భర్తల అలవాట్ల గురించీ, పిల్లల అల్లరి గురించి మాట్లాడుతుంటే, వాళ్లతో ఏం మాట్లాడాలో తోచక ఈమె నోరు పడిపోయేది. జీవిత పరిణామ దశలో తను ఎక్కడో వెనకపడిపోయినట్లు న్యూనతా భావం కింద మగ్గిపోయేది. అయిదవ తనమే ఆడజన్మకు సార్థకత అనే సాంప్రదాయక మనస్తత్వం నుంచీ పార్వతి ఎమ్మెస్సీ బిఇడికి కూడా మినహాయింపు లేదు పాపం.

కన్నె వయసు ఆడపిల్లల్తో కూడా కలవలేదు. వాళ్లల్లో సహజంగా పొంగిపొరలే తుళ్లింతలూ, ఉత్సాహమూ, భవిష్య దాశలూ ఈమెలో కొరవడి ఉండేవి. తన దగ్గర ట్యూషన్ చదువుకున్న విద్యార్థినులు పెళ్లి చేసుకుని సంవత్సరమైనా తిరక్కుండానే ఎత్తైన కడుపుతో భర్త చేయి పట్టుకుని బరువుగా అడుగులేస్తూ కనిపించినప్పుడు, పార్వతి మనోభావాలు ఎట్లుండేవో స్పష్టంగా చెప్పడం కష్టం. బహుశ అసాధ్యమేమో కూడా!

పెళ్లిళ్లయిన ప్రౌఢలూ, పెళ్లికాని పడుచులూ - ఈ రెండు వాతావరణాలకూ వెలి అయిపోయి



ఒకసారి డాక్టర్ సి.నా.రె. గారు, ప్రఖ్యాత నటుడు గుమ్మడి గారు తెనాలి వచ్చారు. గుమ్మడి గారి మిత్రు డొకాయన "మద్రాసు వచ్చి మిమ్మల్ని కలవవలసి ఉంది. మీ అడ్రస్ అదే కదా!" అని అడుగుతూండగానే, పక్కనే ఉన్న సి.నా.రె. "గుమ్మడిగారి 'విధి విలాసం' మారినా, 'వీధి విలాసం' మారలేదు!" అని చెణుకు విసిరారు.

శ్రీగిరి శ్రీకాంత్ [అమలాపురం]

చివరికి ఒంటరితనాన్నే వరించవలసి వచ్చింది పార్వతి.

ప్రస్తుతం తనకు వచ్చే నెల జీతా లన్నీ కూడబెట్టుకుని మంచి కట్నంతో భర్తను కొనుక్కోగల ఆర్థికస్థాయికి చేరుకుంది. కానీ శరీర మ్మీదికి విరుచుకుపడిన ముప్పై ఏళ్ల వయసే ఆమె పెళ్లికి ప్రధాన ఆటంకమై కూర్చుం దిప్పుడు.

తన తండ్రి పెళ్లిళ్ల పేరయ్య దగ్గర మూడు వందల రూపాయలు డిపాజిట్టు కట్టి వరుడిని వెతికిపెడితే ఇదిగో ఇంత కమీషన్ చెల్లిస్తానని ఖాయం చేసుకుని వచ్చినప్పుడూ, 'బ్రాహ్మణ శ్రీవైష్ణవ కుటుంబమునకు చెంది ఉద్యోగం చేస్తూ ముప్పయి ఏళ్ల వయస్సు కలిగిన వధువుకు ఫలానా అర్హతలు గల వరుడు కావలెను' అని పత్రికా ప్రకటన ఇచ్చినప్పుడూ పార్వతికి వికారం లాంటిదేదో కలిగింది. నెత్తి మీద రూపాయి పెడితే అర్థ రూపాయి కూడా అమ్ముడుపోని కొరగాని వస్తువైపోయినట్లు అవమానభారం కింద నలిగిపోయింది. నేను మాత్రం కసిగా ఊహించుకున్నాను - పార్వతి అనే రాకుమారికి స్వయంవరం ప్రకటించినట్లూ; మగ వెధవలమని మీసాలు తిప్పుకునే కట్నాల వరాన్నభక్కుల్నీ హీరో హెూండాగాళ్లనీ ఒక్కొక్కన్నీ తన ఎడం కాలితో తన్నేసి; తన కోసమే ఆశపడీ, బాధపడీ తద్వారా తన స్త్రీత్వాన్ని గౌరవించే ఒక సినలైన పురుషుని కోసం పార్వతి వెతుక్కుంటున్నట్టూ. కానీ ఊహ ఊహే కదా?!


తన కూతురు వృద్ధ కన్యగా మిగిలిపోయినా ఫరవాలేదు కానీ; ఆమె పైనే ఆధారపడిన తన కులమూ, గోత్రమూ వంశప్రతిష్ఠా మొదలైనవి మాత్రం తప్పకుండా కాపాడబడవలసిందే అనుకునే పార్వతి తండ్రి ఒక పురుషుడే! పెళ్లికూతురు ద్వారా కట్నమూ, గోల్డూ, ఇతర వస్తు సంపదా పొందజూసే వరుడూ ఒక పురుషుడే! వీరిద్దరి మధ్యా ఒక ఆటవస్తువైపోయి, ముప్పయి ఏళ్లు వచ్చినా తన కంటూ ఒక పురుషుడిని దక్కించుకోలేని ఆమె స్త్రీత్వపు దౌర్భాగ్యం వెనుక పురుష సమాజం పాత్ర చాలానే ఉంది. కానీ కాలానుగుణంగా ఆలోచించి సంప్రదాయాన్ని సడలించుకోలేని ఆమె లోపం కూడా తీసివేయరానిది. స్మార్తులకూ, శ్రీవైష్ణవులకూ మధ్య ఉన్న హద్దును పాటించకపోయినట్లయితే ఆమె ఇప్పటి మాదిరి మోడు చెట్టులా పడి ఉండేది కాదు.

.ఎవరిలోనైనా ఎంతకాలమని వయసు కోర్కెలు కలల్లోనే అజ్ఞాతం చేస్తూ ఉండిపోతాయి?

న న్నెప్పుడూ 'ఏరా? ఏంపయ్!' అని సంబోధించే పార్వతి, ఆ రోజు అట్లా సంబోధించలేదు. 'బ్లాక్ పాంటులోకి వైట్ ఫుల్ షర్టు టక్ చేస్తే నువ్వు చాలా బావుంటావు రాజా!' అంది. 'నీ నడక చాలా హుందాగా ఉంటుంది' అంది. మా బాల్యపు స్మృతుల్ని ఒక్కొక్కటీ బైటికి తియ్యడం ప్రారంభించింది.

"నేను భార్యలాగా వంట చేస్తే నువ్వు ఆఫీసరులా వచ్చి భర్తలా భోంచేసేవాడివి కదా?" అంది మురిపెంగా చూస్తూ.

నేను ఆమె చూపుల్ని తప్పించుకుంటూ - 'ఇప్పుడు నేను ఆఫీసర్ని కాదు గదా? పొట్ట కోసం సేద్యం అనే ఊబిలోకి దిగబడిన ఒక




రాయలసీమ రైతుని. ఊబి అనేది తప్పుడు ఉపమానమేమో? ఎందుకంటే ఊబిలోని బురదలో తేమ ఉంటుంది. మా తోట బావిలో ఆ బురదపాటి తేమ కూడా లేదు' అని చెప్పుకొచ్చినాను, మా సంభాషణను డైవర్ట్ చేయాలనే ఉద్దేశంతో.

"అవి ఎంత అందమైన రోజులు" - అంటూ ఆమె మళ్లీ గతంలోకే పరుగెట్టింది. తను టెన్త్ పబ్లిక్ కోసం తీయించుకున్న పాస్ పోర్టు సైజు ఫోటో తెచ్చి నా దగ్గర ఛెయిర్ లాక్కుని కూర్చుంది.

"ఆ రెండు జడలూ, ఓణీలో ఎంత ముచ్చటగా ఉన్నానో కదా అప్పుడు? అబ్బ! నా ఫోటో చూసుకుంటే నాకే ఎట్లాగో ఉంది" అని సిగ్గుపడుతూ నవ్వింది. ఆ నవ్వులో టీనేజ్‌ను కోల్పోయిన ముప్పయి ఏండ్ల పార్వతి విషాదమే కనిపించింది నాకు.

ఆ ఫోటోలోని ఆమె అందమూ, రూపలావణ్యమూ ఇక తిరిగిరానివి. ఆ యవ్వన తేజస్సంతా అడివిగాచిన వెన్నెల. అలలు అలలుగా పొంగిన ఆ అందాలన్నీ క్రమక్రమంగా ఆవిరైపోతూ వచ్చి చివరకు ఆ నిర్జీవపు ఫోటోలోకి ఘనీభవించి పోయినాయి. ఒక పాత జ్ఞాపకంగా మిగిలిపోయినాయి.

'చెప్పు. ఎంత బాగున్నానో కదా అప్పుడు?' అంటూ ఒకటే అడగడం ప్రారంభించింది.

'అప్పటికంటే ఇప్పుడే అందంగా ఉన్నావు' అని అబద్ధం చెప్పా లనిపించింది ఒక్క క్షణం. అందం విషయంలో అది అబద్ధమైనా ఫరవాలేదు; తమను మెచ్చుకుంటే చాలు చాలా మంది స్త్రీలకి. కానీ పార్వతిని ఆ కోవలోకి చేర్చే సాహసం చెయ్యలేకపోయినాను.

"ను వ్వెప్పుడు చేసుకుంటావు పెళ్లి? నీ కెట్లాంటి పిల్ల కావాలో చెప్పు. నేను చూసిపెడతాను" అంటూ కూర్చుంది. పార్వతి మాటలు వింతగా అనిపించాయి ఆ రోజు.

"నువ్వు నా కంటే రెండేళ్లు ముందే పుట్టి ఉంటే నేనే నిన్ను పెళ్లి చేసుకునేదాన్ని" అంది చిలిపిగా నవ్వి.

"అత్త కనిపించదేం?" అని అడిగినాను మాట మారుస్తూ.

నా కళ్లలోకి ఒకసారి నిశ్చలంగా చూసింది పార్వతి.

"నన్ను పెళ్లి చేసుకుంటావా రాజా" అని అడిగింది.

ఉలిక్కిపడి అర్థం కానట్లు చూసినాను ఆమె వైపు. నేను నా చెవుల్ని అనుమానించింది ప్రప్రథమంగా ఆ రోజేనేమో? ఆమె తన కళ్లతో ఎదురుచూస్తూ ఉంది నా జవాబు కోసం.

ప్రస్తుతం పార్వతి కంటే నేను పొడగరే కావచ్చు. ఎక్కువ బలిష్టున్నే కావచ్చు. కానీ ఆమె నా కన్నా రెండేండ్లు పెద్దది అన్న భావం నా మనసులోంచి పోదే?

పార్వతి నా కంటే ఎక్కువ చదువుకున్నా ఆమె కంటే నేనే కొంచెం ఆధునికంగా ఆలోచిస్తా ననే నమ్మకం నాలో ఏ మూలో కొంచెం ఉంది. స్మార్తులూ, శ్రీవైష్ణవులూ... అని భేదం పాటించినందుకు పార్వతిని ఛాదస్తపు మనిషి అనుకున్నాను. ఆమె పూజలూ, నోములూ పాటిస్తూ; నా అనాచారాన్ని చూసి 'భ్రష్టుడా' అని మందలించినప్పుడు ఈమె మరీ కరుడుగట్టిన సంప్రదాయవాది అనుకున్నాను. అట్లాంటి సంప్రదాయ ఛాదస్తురాలు నేను దాటలేని మా వయసు తారతమ్యాన్ని ఎట్లా దాటగలిగిందబ్బా అనేదే నాకు ఆశ్చర్యం.

మా మధ్య వయసు తేడా రెండేళ్లే అయినప్పటికీ, ఆ రెండేళ్లే ఒకప్పుడు మా మానసిక ప్రపంచాల మధ్య కల్పించిన అగాథం అంత ఇంత కాదు. ఆమె ఓణీలు వేసేటప్పుడు నే నింకా నిక్కర్లు తొడుగుతూ ఉండేవాడిని. నేను పిల్లతరహాగా ఎగురుతూ దూకుతూ ఆడుకునేటప్పుడు - 'రేయ్! దూరంగా ఉండు. నన్ను ముట్టుకోకూడదు' అని ఒక మూల వికారంగా ముఖం పెట్టి ఒదిగి కూర్చునేది. కానీ అప్పటి అగాథం ఇప్పటి నా ఇరవై ఎనిమిదేళ్లకీ, ఆమె ముప్పయి ఏళ్లకీ మధ్య లేనేలేదు. కారణం, నాకూ పెద్దరికం వచ్చేసి, ఆమె పెద్దరికపు స్థాయిని చేరుకున్నాను; కాకపోతే కొంచెం ఆలస్యంగా!

ఆటబొమ్మల నాటి సమానస్థాయి మళ్లీ ఇన్నేళ్లకు మా మధ్య పునరావృతమైనా ఆమెను భార్యగా మాత్రం ఎప్పుడూ ఊహించుకోలేదు; స్నేహితురాలిగా తప్ప. ఆమె నా వైపే చూస్తూ ఉంది; నే నేం జవాబు చెప్పగలను?

భర్తకంటే భార్య చచ్చినట్టుగా తక్కువ చదివి ఉండాలనీ, ఇంకా ఇంకా చచ్చినట్టుగా తక్కువ వయసు కలిగినదై ఉండితీరాలనీ అనుకునే సాంప్రదాయక భావం నుంచీ బయటపడలేకపోతున్నాను. నిశ్చయంగా అనిపించింది - నే నామెను పెళ్లి చేసుకోలేను. అల్లని నా నిరాకరణను తన స్త్రీత్వానికి జరిగే ఏ పన్నెండో పరాభవంగానో ఆమె భావిస్తే భరించలేను కూడా! ఆమెను పెళ్లాడటానికి నాకు ఏ అర్హతా లేదని చెప్పడం ద్వారా ఆమెను నొప్పించడకుండా నా అనమ్మతి తెలియజేయవచ్చు అనిపించింది.

'నీవు ఎమ్మెస్సీ బిఇడి. నేను డిగ్రీ కూడా గట్టెక్కలేని మొద్దుని' అన్నాను.

'చదువులో ఏముంది? నంస్కారం ముఖ్యంగానీ...' అంది - పోస్టుగ్రాడ్యుయేట్‌ని తప్ప పెళ్లి చేసుకోనని ఒకప్పుడు భీష్మించుకున్న పార్వతి.

'నువ్వు చేతులకు మట్టి కాకుండా ఉద్యోగం చేసే దానివి. నేను బురద పూనుకుంటే తప్ప పొట్టగడవని రైతుని' అన్నాను.

'మా ఉద్యోగస్థులు బతికేది కూడా మీ రైతులు పండించిన పంటలు తినే కదా?' అంది నవ్వి - ఏ ప్రభుత్వ ఉద్యోగినో పెళ్లి చేసుకోవాలని ఒకప్పుడు ఉబలాటపడిన పార్వతి.

ఇంక చివరి అస్త్రాన్ని బైటికి తియ్యక తప్పింది కాదు.

'నేను నీవు అనుకున్నంత మంచివాడిని కాను' అన్నాను.

'ఏం?' అన్నట్లు చూసింది.

'నాకు ఇద్దరు ముగ్గురు స్త్రీలతో పరిచయం ఉంది' అన్నాను - చూపులు పక్కకు తప్పించి.

పార్వతి ఇబ్బందిగా కదిలింది. అర్జంటు పని పడినట్లు చటుక్కున లేచి వెళ్లిపోయింది.

ఆమెతో వివాహాన్ని తప్పించుకోవడానికి, నా చిన్ననాటి స్నేహాన్ని కూడా పణంగా పెడుతున్నానా? అనిపించి ఏదో పోగొట్టుకున్నట్లు వెతపడినాను.

వెళ్లిపోవడానికి లేచి నిలబడినాను. నా కుర్చీ చప్పుడు విని లోపలి నుంచీ గాభరాగా కేక వేసింది - 'పోవద్దు రాజూ వస్తున్నాను.'

పది నిముషాల తరువాత వచ్చి కాఫీ గ్లాసు చేతి కిచ్చింది. మళ్లీ కూర్చుండిపోయినాను. తనూ కాఫీ గ్లాసు పట్టుకుని కిటికీ పక్కన నిలబడింది. కాఫీ తాగుతూ ఉన్నంతసేపూ ఆమె ఏం మాట్లాడలేదు. తర్వాత మెల్లగా అంది - 'అయినా నా కిష్టమే.'

నేని ఆశ్చర్యపోయినాను - పార్వతేనా మాట్లాడేది అనుకుని.

'పెళ్లి అయింతరవాత మారతావు కదా?' ఆమె కళ్లు నవ్వుతున్నాయి. పార్వతి నా కోసం కూడా బుగ్గలు ఎరుపు చేసుకోవడం చూసిన తరువాత నాకు అంతవరకూ లేని ఇష్టమేదో పార్వతి పట్ల ఏర్పడసాగింది. కానీ - పార్వతికి పెళ్లి అవకాశాలు తక్కువైపోయినాయి కనుక ఇన్నేళ్లకుగానీ నేను ఆమె కంటికి ఆనలేకపోయినాను. ఆమె ఎన్నికలో నేను మొదటివాడిని కాలేకపోయినాను కదా అన్న స్వాభిమానం నా మీద బాగానే పనిచేస్తూ ఉంది.




'ఏమో? మన పెద్దవాళ్లు మన పెళ్లికి ఒప్పుకోరేమో? నా కంటే వయసులో పెద్దదానివి కదా....' అని అనేసి బిరబిరా నడిచి బైటపడినాను. ఆ మాట పార్వతి మనసును ఎంత గాయపరిచి ఉంటుందో?

నేను పది రోజులపాటు పార్వతి ఇంటి వైపు తొంగి చూడనుకూడా లేదు. ఆడది అప్పనంగా దొరికితే ఫరవాలేదు కానీ, అదే పెళ్లి చేసుకోవలసి వస్తే ఎన్ని నదనత్సంశయాలో? ఎన్ని అస్తి నాస్తి విచికిత్సలో?!

వెనకటి రోజుల్లో మాదిరి కాకుండా స్త్రీలకు చదువులూ, ఉద్యోగాలూ రావడంతోపాటు వివాహ వయస్సు కూడా ముందుకు పొడిగించబడింది. కట్నాల బేరసారాల మధ్య ఆడకూతుర్ల వయసులు మరీ ముదిరిపోతాయి. వయసు ముదిరిన మగవాళ్లకి తమ కంటే పదేళ్లు తక్కువగా ఉన్న ఆడపిల్లల్ని పెళ్లి చేసుకునే అవకాశం ఉంది కాబట్టి వాళ్లని చాలా నంబంధాలే వెతుక్కుంటూ వస్తాయి. వయసు ముదిరిన ఆడపిల్లలకు తమకంటే ఇంకా ముదిరిపోయిన మగవాళ్లను తప్ప పెళ్లి చేసుకునే అవకాశం లేదు కాబట్టి వాళ్లకు పెళ్లి నంబంధాల ఛాన్సులు తగ్గిపోతూ వస్తాయి.

ఈ మారిన పరిస్థితుల్లో వధువు వరుని కంటే చిన్నదై ఉండాలనే సాంప్రదాయిక మనస్తత్వానికి అర్థమేమిటి? దాన్ని మార్చుకుంటే తప్పేమిటి?

'తప్పులేదు నిజమే? కానీ నాకేం అవసరం?' అని కూడా అనిపించింది. పదహారేళ్ల బాలామణిని పెళ్లి చేసుకునే అవకాశాలు నా కింకా దూరం కాలేదు కదా? నాకు అవసరమైనప్పుడు నంప్రదాయాల్ని వదులుకోగలిగినంత సులభంగా, ఇతర్లకు అవసరమైనప్పుడు వదులుకోగలనా?

గిడ్డంగిలో ఓట్లు స్టాకు నరకులా పడి ఉన్న పార్వతి కోసం వరుడిని వెదుకుతూ వెదుకుతూ మిట్టమధ్యాహ్నం ఎండలో తిరిగొచ్చి కాఫీ తాగి చప్పున గుండె పట్టుకుని చచ్చిపోయినాడు మా మామయ్య.

'ఒక్కగా నొక్క కూతురు పెండ్లి చూడకుండానే చచ్చిపోతివి కదరా అన్నయ్యా?' అని ఏడ్చింది మా అమ్మ.

'పావం! కొడుకు ఉంటే తలకొరివి పెట్టేవాడు'

అని - జరిగింది చాలదన్నట్లు దానికి మరికొంత దురదృష్టాన్ని జోడించినారు బంధువులు.

బాధకు విముక్తి లేదని, బాధ నుంచీ తనే విముక్తి చెందినట్లుగా కనిపించింది మామయ్య శవం. మామయ్య గుండెల్లోకి దించి లాగేసిన కత్తిలా కన్నీళ్లోడుతూ ఉంది పార్వతి. ఆమెను మాటల్లో ఓదార్చే సాహసం చెయ్యలేకపోయినాను.

మామయ్య శవాన్ని దహనం చేసినారు. పదమూడు రోజుల పిండ ప్రదానం చేసినారు. తొమ్మిదో రోజున మామయ్య అన్న కొడుకు 'ఖర్మ' అని గొణుక్కుంటూ గుండు కొట్టించుకున్నారు. ప న్నెండో రోజు అత్తయ్య అయిదోతనాన్ని తీసివేయాల్సిన రోజు. అంతా ఏటిగట్టుకు పోయినారు. ఊరిబైట ఉంది ఆ ఏరు.

ఆ ఏట్లో ఇప్పుడు ఒక చుక్క నీళ్లు కూడా లేవు. ఆ ఏరు ప్రవహిస్తూ ఉన్న కాలంలో మనుషుల అవసరాలకు ఉపయోగపడింది. ఇప్పు డది ప్రవహించడం ఆగిపోయినా మనుషుల్తో పూజలు జరిపించుకుంటూనే ఉంది.

మూడు కిలో మీటర్లు పోయి, రెండుబిందెల నీళ్లు ఆటోలో వేసుకొచ్చి ఆ ఎండిపోయిన ఏటికి గంగమ్మ పూజ చేసినారు. ఆ విధంగా మా అత్తయ్య అయిదుతనాల్ని తీసివేసే తంతు ముగించినారు.

ప్రవహించడం ఆగిపోతే అది ఏరు ఎట్లవుతుంది? కర్మల్ని నిర్వర్తించడానికి ఆ ఏటి దగ్గరికే పోకపోతే నేమి? అదంతే నంప్రదాయం! దేశ కాలాలకు అనువుగాలేని నంప్రదాయ పద్ధతుల్ని బతికించుకునే ప్రయత్నం ఎంత

అర్థరహితమైంది? - శవం ముక్కుకు ఆక్సిజన్ పెట్టినట్లు.

కానీ, ఒకప్పుడు ఆ ఏటి నీళ్ళు తాగే - నా మనుషులు బతికినారనీ, ఆ ఏటి కింద పండిన పంటలు తినే - నా ఊరు పెరిగి పెద్దదయిందనీ మాత్రం నేను ఎప్పటికీ విస్మరించలేను. అంతమాత్రం చేత ప్రవహించడం ఆగిపోయిన ఏరును జీవితంగా స్వీకరించనూలేను.

సమాజ మంటే మార్పులేని వస్తు వేమీ కాదని తెలుసు. మరి - మారిపోయిన సమాజంలోని పార్వతిని ఎందుకు స్వీకరించలేకపోతున్నాను?

నా మనసు త్రాసై తూగుతూంది. ఒకవైపు - పార్వతిలోని ఆ అదనపు రెండేళ్ళూ; మరోవైపు - పార్వతిలోని నా చిన్ననాటి స్నేహమూ పక్కపక్కనే తూకం వేసుకుంటున్నాయి. తూగితూగి చివరకు- ఆ అదనపు రెండేళ్ళనీ ఖాతరు చెయ్యకుండా నా చిన్ననాటి స్నేహితురాలివైపే మొగ్గు చూపింది తరాజు!


పార్వతిని పెళ్ళి చేసుకోవాలనే నా నిర్ణయం వెనుక ఆమె తండ్రిని కూడా కోల్పోయింది కదా అన్న సానుభూతి కూడా పనిచేసిందేమో? నా తండ్రి నుంచీ ఇతర బంధువుల నుంచీ కొన్ని అభ్యంతరాలు వచ్చినా మా పెళ్ళి మేం అనుకున్నట్లుగానే జరిగిపోయింది.

ఒక రోజు - మా పెళ్ళి ఫొటోల ఆల్బమ్‌లో తన పాత ఫొటోలుకూడా చూసుకుంటూ - ఆనాటి ముగ్ధత్వమూ, రూపలావణ్యాలను నాకు అందించలేకపోయినందుకు విచారపడిం దామె.

'ఆ టీనేజ్ పార్వతి కంటే కళ్ళద్దాల పార్వతే నా కిష్టం' అన్నాను.

'ఎందుకో పాపం?' అని తన పాత ఫొటో పైన జాలిపడింది.

'ఆ టీనేజ్ పార్వతి నన్ను ప్రేమించలేదు కనుక....! అంతేకాదు. ఆ పార్వతి - నేను లెక్కలు తప్పు చేస్తే మొట్టికాయలు వేసింది. మార్కులు తక్కువ వచ్చినాయని తిట్టింది. అందుకని.....!' అన్నాను.



## అలక !

"మా ఆవిడ ప్రతిరోజూ అలక పాన్పు ఎక్కుతుంది, ఏం చేయమంటావ్?" అడిగాడు మిత్రుడైన రాజాని సురేష్.

"మీ ఇంట్లో ఉన్న మంచం అమ్మేసేయ్!" జవాబిచ్చాడు రాజా.

"నాకు చాలా ఆకలి వేస్తోంది, మా ఆయన రాత్రి అలిగాడు!" చెప్పింది రాధ.

"అదేమిటి, ఆయన అలిగితే నీకు ఆకలిగా ఉండటం!?" ఆశ్చర్యంగా అంది సుమతి.

"ఆయన అలిగిన రోజు వండిన అన్నం అంతా ఆయనే తినేస్తారు మరి!" చెప్పింది రాధ.

మంచాల శ్రీనివాసరావు [గుంటూరు]

'అవును మొద్దూ' అని పగలబడి నవ్వింది.

ఇంకొక రోజు - 'నాక్కూడా నీ మాదిరే ఉద్యోగం వస్తే బాగుణ్ణు' అన్నాను.

'ఏం ఇప్పుడేం తక్కువైందని మనకు - బాగానే ఉన్నాం కదా?' అంది నా వైపు ప్రేమగా చూసి.

'నువ్వు రిటైర్ అయిపోయి ఇంట్లో కూర్చుని ఉంటే; నే నింకా రెండేళ్ళ పాటు సైకిల్ తొక్కుతూ ఉద్యోగానికి వెళ్ళిరావాలని ఉంది' అన్నాను.

ఆ జోకును ఎంతో స్పోర్టివ్‌గా తీసుకుని నవ్వింది పార్వతి.

ఆడపిల్లలు ఎంత తొందరగా ఎదిగి వస్తారో, అంత తొందరగానూ వృద్ధాప్యంలో పడిపోతారని అంటారు. కానీ వృద్ధాప్యాన్ని వాయిదా వేయగలిగిన్న మానసిక ఆరోగ్యం వల్లా; జీవన సౌందర్యం వల్లా నాకు మరింత విశ్వాసం కలిగిం దిప్పుడు.

మా తోటకు పెస్టిసైడ్స్ కొనాలనీ, బోరువెల్లుకు కరెంట్ ఛార్జీలు కట్టాలనీ అనుకుని, నేను డబ్బు కోసం సతమతమవుతుంటే - 'ఇదిగో నా నెల జీతం' అని, పార్వతి నా చేతుల్లోకి మూడు వేల రూపాయలు పోస్తుంది. అప్పుడు మాత్రం అనుకుంటాను - పార్వతి నా చిన్ననాటి స్నేహితురాలు కాబట్టి పెళ్ళి చేసుకున్నానా? లేక వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా సాయపడే ఉద్యోగస్థురాలు కాబట్టి పెళ్ళి చేసుకున్నానా? అని. కానీ అది నా న్యూనతా భావం కాదు. ఆత్మావలోకనమే?!

స్త్రీ పురుష సంబంధాలు అవసరాలకు అతీతమైనవి అనే అలౌకికత్వంతో నన్ను నేను మభ్యపెట్టుకోలేను. అంతమాత్రం చేత - మానవ సంబంధాల్ని పరిపాలించే హక్కు కేవలం అవసరాలకు మాత్రమే ఉందని సిద్ధాంతీకరించే అమానుషత్వానికి కూడా ఒడికట్టలేను.

కొత్త అవసరా లేర్పడి పాత విలువలూ, సంప్రదాయాలూ తలకిందులు అయిపోవచ్చు. అంతమాత్రం చేత మనిషిలోని ప్రేమా, స్నేహమూ, సహానుభూతీ కూడా తలకిందులు అయిపోతాయని అనుకోనక్కర్లేదు - అర్థాన్ని తలకిందులు చేయగలరా ఎవరైనా?

మొత్తానికి మేం బాగున్నాం!

